

KADILIMCHE VAARTHA Telugu daily
కదిలించే వార్త
తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

బ్యూరో చీఫ్ జోడు రమేష్ కుమార్, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా సంపుటి : 11 సంచిక : 212 ఆదివారం 02 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : 05

Published From Kadapa : Circulated at | Ananthapuram | Tirupati | Vishakapatnam | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Vijayawada | Ongole | Chittore | Khammam | Hyderabad | Mahabubnagar



# భోగాపురం విమానాశ్రయం
# ఉత్తరాంధ్ర అభివృద్ధికి
# కొత్త రన్‌వే..



- ఈ గడ్డపై అడుగుపెట్టడం ఎంతో గర్వకారణం.. ఉత్తరాంధ్ర పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ
- రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు ఖరారు
- గిరిజన మహిళల థింసా నృత్యం ప్రపంచ రికార్డు సాధించిందన్న ప్రధాని
- చంద్రబాబు దార్శనికతను మనస్ఫూర్తిగా అభినందించిన మోదీ

3




## ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ కొత్త అధ్యాయం

- మోదీని విమర్శిస్తుంటే బాధపడ్డా: డిప్యూటీ సీఎం పవన్
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ కీలకమన్న పవన్
- దేశాన్ని మోదీ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ప్రశంస
- చంద్రబాబు మార్గనిర్దేశంలో ఏపీ అగ్రగామి రాష్ట్రంగా మారుతుందని ధీమా



# ప్రమాదకరంగా గోదావరి

- అంతకంతకూ పెరుగుతున్న ప్రవాహం
- రాజమహేంద్రవరం వద్ద క్రమంగా పెరుగుతున్న గోదావరి ఉధృతి
- 175 గేట్లు ఎత్తి వచ్చిన వరద నీటిని వచ్చినట్లుగా వదులుతున్న అధికారులు
- వరద ఉధృతితో పలు మండలాలకు నిలిచిపోయిన రాకపోకలు



**అమరావతి**

రాజమహేంద్రవరం వద్ద గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ఎగువన రాష్ట్రాలతో పాటు, తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తుతోంది. ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 13 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం 11.46 లక్షల క్యూసెక్కులకు పైగా నీరు దిగువకు ప్రవహిస్తుండగా అంతకంతకూ పెరుగుతోంది. భద్రాచలం నుంచి భారీగా వరద - మిగతా3లో




## వెన్నుపోటు కూటమి అసత్య ప్రచారాలను భూస్థాపితం చేయాలి

- 'నాయీ బ్రాహ్మణులను రాజకీయంగా ప్రోత్సహించింది జగనే
- వెన్నుపోటు కూటమి అసత్య ప్రచారాలను భూస్థాపితం చేయాలి
- వైఎస్సార్‌సీపీ కమిటీల్లో 10 వేల మంది నాయీ బ్రాహ్మణులకు స్థానం
- పార్టీ నిర్మాణంలో బీసీలకు 60 శాతానికి పైగా ప్రాతినిధ్యం
- జగన్ హయాంలో 15--20 ఏళ్ల అభివృద్ధి, సంక్షేమం అందింది.

**అమరావతి**

తాడేపల్లి: వెన్నుపోటు కూటమి అసత్య ప్రచారాలను భూస్థాపితం చేయాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం, ఆగస్టు 1వ తేదీ తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాల యంలో నాయీ బ్రాహ్మణులతో సమావేశం నిర్వహించారు - మిగతా3లో

## క్షమించడం కాదు.. విద్యార్థులకు మోదీ క్షమాపణలు చెప్పాలి



- బాధిత కుటుంబాలను పరామర్శించని ప్రధాని
- విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడే సాహసం చేస్తున్నారని వ్యాఖ్య
- తమిళనాడు పర్యటనలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు
- లీక్ అయిన ప్రశ్నపత్రాలు. రద్దయిన పరీక్షలు. సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమైంది



## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

- వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం భారత సంస్కృతిలో భాగమన్న సీజేఐ సూర్యకాంత్
- జైపూర్‌లో జరిగిన కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సులో కీలక ప్రసంగం
- వేదాలు, రామాయణ, మహాభారతాల్లోనే మధ్యవర్తిత్వ సూత్రాలున్నాయని వెల్లడి



## నీట్ యూజీ 2026: ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం

- నీట్ యూజీ 2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్టీఏ
- ఆగస్టు 4 నుంచి ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్ ప్రారంభం
- సెప్టెంబర్ 8 నుంచి అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల తరగతులు
- సెలవుల్లోనూ పనిచేయాలని మెడికల్ కాలేజీలకు ఆదేశాలు

# ప్రమాదకరంగా గోదావరి

-మొదటిపేజీ తరువాయి

నీరు వస్తుండగా ధవళేశ్వరం వద్ద 15 లక్షల క్యూసెక్కులకు చేరనుందని, రెండో ప్రమాద హెచ్చరిక సైతం జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి సుమారు 11.46 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో పలు లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వే కొట్టుకుపోవడంతో లంక గ్రామాల వాసులు బోట్లు ఎక్కి ప్రయాణం సాగిస్తున్నారు. తూర్పుగోదావరి, కోనసీమ, పోలవరం జిల్లాల్లో అధికార యంత్రాంగం సహాయక చర్యలు ముమ్మరం చేసింది. ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ, వారికి ఇబ్బంది లేకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ శిబిరాలు సైతం సిద్ధం చేస్తున్నారు.

లంకగ్రామాల ప్రజలు మరపడవల సాయంతో రాకపోకలు: అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 17 మండలాలు, 32 లంకగ్రామాలకు వరదముప్పు ఉన్నట్లు గుర్తించిన అధికారులు ముందస్తుగా సహాయక చర్యలకు సిద్ధమవుతున్నారు. వరద దృష్ట్యా జిల్లాలో సిబ్బంది, అధికారులకు సెలవులను కలెక్టర్ రద్దు చేశారు. బ్యారేజ్ నుంచి దిగువన ఉన్న గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదీపాయలు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. బ్యారేజ్‌కు దిగువున ఉన్న లంకగ్రామాల ప్రజలు మరపడవల సాయంతో రాకపోకలు సాగిస్తున్నారు.

లంక గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ పర్యటించి అధికారులకు వరద హెచ్చరికలపై దిశానిర్దేశం చేశారు. పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులో వరద రేవు పరిస్థితిని అధికారులు అంచనా వేశారు. విద్యార్థులు, గర్భిణీలు, వృద్ధులు ఎవరూ ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోనసీమలో వివిధ నదీపాయల్లో తాత్కాలిక బాటలు తెగిపోయాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల పరిధిలో వరద ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.

భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ: తెలంగాణలోని



భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపు దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రవాహం పోటెత్తుంది. గోదావరి నీటిమట్టం 54.8 అడుగుల చేరింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరిలో 14.26 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. పోటెత్తుతున్న వరదతో స్నానఘట్టాలు, కళ్యాణకట్ట, విద్యుత్ స్తంభాలు మునిగిపోయాయి.

వరద ఉధృతితో పలు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చర్లలోని తూరుబాక వద్ద రోడ్డు పైకి నీరు చేరింది. వరద నీటితో చింతూరు, కూనవరం, వీఆర్ పురం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు 43 అడుగుల వద్దకు చేరుకోగా అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు 48 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం 55 అడుగులకు నీటిమట్టం చేరింది. దీంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో రాజమహేంద్రవరం వద్ద ప్రవాహం పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.75 అడుగులకు చేరింది. ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లు ఎత్తి సముద్రంలోకి 10 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేశారు.

గోదావరి నీటిమట్టం పెరుగుతున్నందు వల్ల ప్రజలకు అందుబాటులో ఉండేందుకు అధికారులు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు.

కోనసీమ జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ – 08856 – 293104

అమలాపురం కంట్రోల్ రూమ్ – 08856 – 233208

రామచంద్రపురం కంట్రోల్ రూమ్ – 08857 – 245166

కొత్తపేట కంట్రోల్ రూమ్ – 85002 – 38258, 08855 – 244299

# మండలి కోసం వడపోతలు షురూ

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి లో గవర్నర్ కోటాకు చెందిన రెండు సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ఈ స్థానాల్లో కొనసాగిన పందుల రవీంద్ర , జకియా ఖానం పదవీకాలం ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ( ఈ రెండు స్థానాలను భర్తీ చేసే అవకాశం ఉండటంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలోనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, సామాజిక సమీకరణాల్లో కీలక పాత్ర పోషించే నేతలు తమ పేర్లను పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మిత్రపక్షాలకు ఈ స్థానాలను కేటాయించకుండా రెండింటినీ టీడీపీనే భర్తీ చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ చర్చ సాగుతోంది. దీంతో పార్టీ అంతర్గతంగా పోటీ మరింత పెరిగింది. ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో ప్రభుత్వానికి అవసరమైన బిల్లులు సులభంగా ఆమోదం పొందుతున్నాయి. అయితే శాసన మండలిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతి అంశంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. కొన్ని కీలక బిల్లులపై మండలిలో తీవ్ర చర్చలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన ఫలితాలు రాకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయిఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక బిల్లులు శాసన మండలిలో ఆశించిన విధంగా ఆమోదం పొందలేదు. పార్టీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే ప్రతిపాదనతో తీసుకొచ్చిన బిల్లు మండలిలో నిలిచిపోయింది. అలాగే పీపీపీ విధానంలో కొన్ని మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాలు మండలిలో ప్రభుత్వ వాదనను మరింత బలంగా వినిపించే నాయకుల అవసరాన్ని టీడీపీ ముందుకు తెచ్చాయి. అందుకే సభలో దూకుడుగా వాదించే, ప్రతిపక్ష విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పగల నాయకులను ముందుకు తీసుకురావాలనే ఆలోచనకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఈ వ్యూహంలో భాగంగానే శ్రీకాకుళం (కు చెందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు. ఆమె పార్టీ



తరఫున చురుకుగా వ్యవహరిస్తున్నప్పటికీ, మండలిలో మరింత దూకుడుగా వాదించే నాయకులు అవసరమనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. అందుకే ఈసారి బలమైన వాక్చాతుర్యం కలిగిన, ప్రతిపక్షంపై సమర్థంగా ఎదురుదాడి చేయగల నేతలను ఎంపిక చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, భవిష్యత్ రాజకీయ అవసరాలు వంటి అంశాలను కూడా టీడీపీ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలుస్తోంది. పార్టీకి విధేయతతో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయం కూడా ఉంది. మొత్తంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కేవలం నామినేషన్ ప్రక్రియ మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ వ్యూహాలకు కూడా కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. అందుకే తుది ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.శాసన మండలిలో ఖాళీ అయిన.. రెండు స్థానాలను భర్తీ చేసే విషయంపై టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు మౌనంగా ఉన్నారు. ఈ రెండు సీట్లు కూడా గవర్నర్ కోటాలో భర్తీ చేసేవే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి సర్కారుకు గవర్నర్ అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి పెద్దగా ఎలాంటి ఇబ్బందులు ఉండే అవకాశం లేదు. దీంతో ఎవరిని ఎంపిక చేసినా ఇట్టే వారు మండలిలో కూర్చుంటారు. దీంతో నాయకులు మరిన్ని ఆశలు పెట్టుకున్నారు. గతంలో తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎంపిక వివాదం అయింది. సుప్రీంకోర్టు వరకు సాగింది. అయితే.. ఇలాంటి వివాదాలు ఏపీలో కనిపించడం లేదు. దీంతో బాబు నిర్ణయమే ఫైనల్ అన్నట్టుగా ఉంది. ఇది నాయకుల్లో మరిన్ని ఆశలు రేకెత్తిస్తోంది. అయితే.. తాజాగా సీనియర్ నాయకులతో సచివాలయంలో చంద్రబాబు భేటీ అయినా.. ఈ విషయంపై ఆయన ఎక్కడా స్పందించలేదు. ఇది మరింతగా నాయకుల్లో టెన్షన్ పెంచుతోంది. ఇటీవల రాజ్యసభ ఎన్నిక ల సమయంలోనూ టీడీపీ కోటాలో ఎంపిక చేసేవారి పేర్లను ఇంతే గోప్యంగా ఉంచారు. ఫలితంగా ఆశలు పెట్టుకున్నవారు.. చివరి వరకు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూశారు. ఎంపిక ప్రక్రియ అయిపోయిన తర్వాత..ఆశలు పెట్టుకున్న అందరూ నిరుత్సాహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా బాబు బాంబు పేలుస్తారా? అనేది చర్చకు దారితీసింది. అలా వద్దని.. సడెన్‌గా పేర్లను వెల్లడిస్తే.. కేడర్‌లో చులకన అవుతున్నామని ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని, అయితే.. ఆ నిర్ణయమేదో సాధ్యమైనంత త్వరగా ప్రకటిస్తే.. కేడర్‌ను సంతృప్తి పరిచేందుకు.. తమ ఫ్యామిలీలను సంతృప్త పరిచేందుకు కూడా అవకాశం ఉంటుందని అంటున్నారు. మొత్తంగా ఈ విషయంపై టీడీపీలో చర్చ సాగుతోంది. కొందరు నాయకులు వస్తుందో రాదో అన్న బెంగతో తరచుగా ఫోన్లు కూడా చేస్తున్నారు. మరి చంద్రబాబు ఎ వరిని కరుణిస్తారో చూడాలి. ఏదేమైనా సడెన్‌గా కాకుండా ముందుగానే ప్రకటించాలని నాయకులు కోరుతున్నారు.

## వీర మహిళలకు పెద్ద పీట....

**కాకినాడ**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమైన సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అనేక జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు నాయకత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయకపోవడంతో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పార్టీ కార్యవర్గాన్ని అప్పట్లో రద్దు చేశారు. ఇప్పుడు దాదాపు అన్ని పదవులు రద్దయ్యాయి. అలాగే పార్టీ అధికార ప్రతినిధులుగా మహిళలకే చోట కల్పించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి

## వెన్నుపోటు కూటమి అసత్య ప్రచారాలను భూస్థాపితం చేయాలి

-మొదటిపేజీ తరువాయి

సజ్జల. ఈ కార్యక్రమానికి నాయీ బ్రాహ్మణ విభాగం నేతలతో పాటు ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, లేళ్ల అప్పిరెడ్డి, తదితరులు హాజరయ్యారు. దీనిలో భాగంగా సజ్జల మాట్లాడుతూ.. ‘నాయీ బ్రాహ్మణులను రాజకీయంగా ప్రోత్సహించింది జగనే. వెన్నుపోటు కూటమి అసత్య ప్రచారాలను భూస్థాపితం చేయాలి. వైఎస్సార్‌సీపీ కమిటీల్లో 10 వేల మంది నాయీ బ్రాహ్మణులకు స్థానం. పార్టీ నిర్మాణంలో బీసీలకు 60 శాతానికి పైగా ప్రాతినిధ్యం.జగన్ హయాంలో 15--20 ఏళ్ల అభివృద్ధి, సంక్షేమం అందింది. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.3 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టింది. అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ నేతలను వేధిస్తున్నారు. డీఎస్సీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా కూటమి అబద్ధాలను తిప్పికొట్టాలి. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో మరిన్ని పదవులుంటాయి. 2029లో జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా పని చేయాలి. టీటీడీ బోర్డులో నాయీ బ్రాహ్మణులకు జగనే అవకాశం కల్పించారు. దేవాలయ పాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించిందీ జగనే. దేవాలయాల్లో ఉద్యోగులుగా గుర్తింపు, రూ.20 వేల జీతం ఖరారు చేశాం. ప్రతి షాపుకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చాం. కరోనా సమయంలో ఒక్క బటన్‌తో రూ.50 కోట్ల సాయం చేశాం. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌తో పాటు కీలక పదవులు ఇచ్చిన ఘనత జగన్‌దే. జగన్ చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి’ అని స్పష్టం చేశారు.

## భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన ‘థింసా’ ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు.

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త ‘రన్‌వే’గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక ‘లాంచ్‌ప్యాడ్’ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. “అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం” అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ కొత్త అధ్యాయం..

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ దేశాన్ని ‘వికసిత్ భారత్’ దిశగా వేగంగా నడిపిస్తున్నారని పవన్ కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎదుర్కొన్న విమర్శలను పవన్ గుర్తుచేసుకున్నారు. గతంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రధానిని కొందరు విమర్శిస్తున్నప్పుడు తాను చాలా బాధపడ్డానని తెలిపారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, వెనక్కి లాగే ప్రయత్నాలు జరిగినా మోదీ ఎక్కడా భయపడలేదని ప్రశంసించారు. మోదీ లాంటి ప్రధాని దేశానికి లభించడం అందరి అదృష్టమని, తనను దూషించిన వారిని కూడా క్షమించే గొప్ప గుణం ఆయనదని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం..

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో ‘అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం’ ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు



ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు.

ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. “రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం” అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ధీమా వ్యక్తం చేశారు.

రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

# జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌లో వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల గురు--శిష్యులకు స్వర్ణ పతకం

**- ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించి గోల్డ్ మెడల్ సాధించిన ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, విద్యార్థి హరిప్రసాద్‌కు ఘన సన్మానం**



వేంపల్లె (కదిలించే వార్త)ఆగస్టు 01:

వై.ఎస్.ఆర్. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేంపల్లె కి చెందిన ఫిజికల్ డైరెక్టర్ రాచవీటీ తేజేంద్ర మరియు అదే కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఏ. హరిప్రసాద్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి కళాశాలకు, రాష్ట్రానికి గౌరవం తీసుకువచ్చారు.ఇండియా కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జమ్మూ--కాశ్మీర్‌లోని జమ్ము తావిలో ఉన్న ఇండోర్ స్టేడియంలో జూలై 24 నుంచి 26 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్న గురు--శిష్యులు సీనియర్ మెన్స్ డబుల్స్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు.ఈ విజయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మురళి, రాష్ట్ర కార్యదర్శి మనోహర్ రెడ్డి అభినందిస్తూ, క్రీడారంగంలో యువతకు వీరు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్రతో పాటు అధ్యాపకులు డా. సతీష్, హాజియా బేగం, హరిత, రాజారెడ్డి, జనార్ధన్, ఇతర బోధక, బోధనేతర సిబ్బంది గురు--శిష్యులను ఘనంగా అభినందించారు. వారి కృషి, క్రమశిక్షణ, పట్టుదల కళాశాల విద్యార్థులకు ఆదర్శమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచాలని కళాశాల కుటుంబం ఆకాంక్షించింది.

## ఆగస్టు 10 వరకు ఐటీఐ ప్రవేశాలకు గడువు పొడిగింపు






లింగాల కదిలించే వార్త ఆగస్టు 1ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ), లింగాలలో 2026--27 విద్యా సంవత్సరానికి రెండో విడత ప్రవేశాల దరఖాస్తుల గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ వాసుబాబు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఆసక్తి గల అభ్యర్థులు ఉఅ.ఖజూ.ప్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసిన అనంతరం తప్పనిసరిగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో లింగాల ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థుల పేర్లు మెరిట్ జాబితాలో నమోదు కావని స్పష్టం చేశారు.ప్రస్తుతం రెండు సంవత్సరాల కోర్సులైన ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ (ఎలక్ట్రికల్), సివిల్ ట్రేడ్లలో, అలాగే ఒక సంవత్సరం కోర్సులైన డీజిల్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా )ట్రేడ్లలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.శిక్షణ సమయంలో ఇంప్లాంట్ ట్రైనింగ్ ద్వారా వివిధ కంపెనీల్లో శిక్షణ పొందే అవకాశం కల్పించడంతో పాటు, కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు 100 శాతం ప్లేస్‌మెంట్ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.మరిన్ని వివరాలకు 9948608397, 9100843624, 9703853847 నంబర్లను సంప్రదించాలని ఐటీఐ ప్రిన్సిపాల్ వాసుబాబు కోరారు.

## భక్తిశ్రద్ధలతో అంజన్నకు విశేష పూజలు



సింహాద్రిపురం కదిలించే వార్త ఆగస్టు 1సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి ఆకు పూజ తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం ,మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## శిశువు ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు తల్లిపాలే అమృత సంజీవని

**- జన్మించిన గంటలోపే ముర్రుపాలు.. తొలి ఆరు నెలలు తల్లిపాలే శ్రేష్ఠం**

**- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లులకు విస్తృత అవగాహన**



వేముల కదిలించే వార్త ఆగస్టు 01 శిశువు ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు తల్లిపాలే తొలి వరమని,బిడ్డ పుట్టిన వెంటనే లేదా గంటలోపు ముర్రుపాలు పట్టించడం ప్రతి తల్లి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.హసీనా పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వేముల-3 అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె గర్భిణులు, బాలింతలు, తల్లులను ఉద్దేశించి మాట్లాడారు.శిశువుకు పుట్టిన వెంటనే అందించే ముర్రుపాలు ప్రకృతి ప్రసాదించిన తొలి టీకా వంటివని, అవి రోగనిరోధక శక్తిని పెంచి అనేక అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. జననం నుంచి తొలి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు, తేనె, ఇతర ద్రవాలు లేదా ఘనాహారం ఇవ్వడం శిశువు ఆరోగ్యానికి హానికరమని సూచించారు.హెల్త్ సూపర్వైజర్ జి. విజయలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగాలకు వెళ్లే తల్లులు తల్లిపాలను పరిశుభ్రంగా పిండి నిల్వ చేసి ఫ్రిజ్‌లో ఉంచి 24 గంటలలోపు శిశువుకు ఇవ్వవచ్చని తెలిపారు. పాలు నిల్వ చేసే విధానం, పాత్రల పరిశుభ్రత, శిశువుకు అందించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి తల్లుల్లో అవగాహన కల్పించారు.తల్లిపాల వల్ల శిశువుకు సంపూర్ణ పోషకాహారం లభించడమే కాకుండా, తల్లి ఆరోగ్యానికీ అనేక ప్రయోజనాలు కలుగుతాయని, ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకొని పాటించాలని అధికారులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త వి. లక్ష్మీకళ, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# తులసిరెడ్డి నిశ్చల రాజకీయ ప్రస్థానానికి జన్మదిన నీరాజనం

**- బ్రహ్మంగారిమఠం ఆలయంలో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టినరోజు వేడుకలు**

**- శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సోమా అమర్‌నాథ్ రెడ్డి**





బ్రహ్మంగారిమఠం కదిలించే వార్త ఆగస్టు 1

రాష్ట్ర రాజకీయాల్లో స్వచ్ఛతకు, నిబద్ధతకు నిలువెత్తు రూపం ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ రాజ్యసభ సభ్యులు నర్రెడ్డి తులసిరెడ్డి అని కాంగ్రెస్ పార్టీ బ్రహ్మంగారిమఠం మండల అధ్యక్షుడు సోమా అమర్‌నాథ్ రెడ్డి కొనియాడారు. తులసిరెడ్డి 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారిమఠంలోని జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి పాదపద్మాల వద్ద తులసిరెడ్డి పేరిట ప్రత్యేక గోత్రనామాలతో అర్చకులు పూజాధికాలు జరిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బ్రహ్మంగారిమఠం మండల అధ్యక్షులు సోమా అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ... దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఎలాంటి మచ్చ లేని నాయకుడిగా తులసిరెడ్డి ప్రజాదరణ పొందారని తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా జడ్పీ చైర్మన్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్‌గా ఆయన సమర్థవంతంగా సేవలు అందించి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని గుర్తుచేశారు. పదవులు మారినా, కాలాలు మారినా ఆయన సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవే పరమావధిగా జీవిస్తున్నారని ప్రశంసించారు.రాజకీయాల్లో నిరంతరం ప్రజాహితం కోరే తులసిరెడ్డి మరిన్ని వసంతాలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆ జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ప్రజలకు మరింత సేవ చేసే దివ్యశక్తిని భగవంతుడు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తులసిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు.

# చీటీలు- వడ్డీల పేరుతో ఘరానా మోసం

**- సుమారు రూ.7 కోట్ల మేర అప్పులతో విశ్రాంత ఉపాధ్యాయుడు ఐపీ**

**- మాకు న్యాయం చేయలని**

**- డీఎస్పీని ఆశ్రయించిన బాధితులు**





పులివెందులకదిలించే వార్త ఆగస్టు1 చిట్టీలు వడ్డీల పేరుతో పులివెందుల పట్టణానికి చెందిన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు సుమారు రూ.7 కోట్ల మేర అప్పులు చేసి ఐపీ దాఖలు చేసినట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది, భార్యాభర్తలు కలిసి మోసం చేయడంతో

**బాధితులు లబోదిబోమంటున్నారు. సుమారు**

రూ.7 కోట్ల మేర అప్పులు చేసి ఐపీ దాఖలు చేసినట్లు సమాచారం. బాధితుల వివరాల మేరకు పులివెందుల పట్టణం ముద్దనూరు రోడ్డులో నివాసం ఉంటున్న శివకాశి రెడ్డిఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆయన భార్య సావిత్రమ్మ చీటీలు వడ్డీల వ్యాపారం నిర్వహించేవారు. వారి ఇద్దరు కుమారులు అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ప్రజల నుంచి చీటీల డబ్బులు,వడ్డీ ల పేరుతో ప్రజల నుంచి పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నరని కొన్ని రోజుల నుంచి ఇంటికి తాళాలు వేసి వెళ్లిపోయారని బాధితులు తెలిపారు. 63 మంది బాధితుల నుంచి సుమారు 6 కోట్ల 31 లక్షల పైచిలుకు అప్పు తీసుకున్నట్లు సమాచారం. కొందరు బాధితులకు కోర్టు నుంచి ఐపీ సంబంధిత నోటీసులు అందినట్లు సమాచారం తెలిపారు.

**డీఎస్పీని ఆశ్రయించిన బాధితులు**

తమకు ఇవ్వాల్సిన డబ్బులు తిరిగి ఇప్పించి

న్యాయం చేయాలని కోరుతూ బాధితులు పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, సీఐ శ్రీరామ్‌లను కలిసి ఫిర్యాదు చేశారు. శివకాశి రెడ్డి,సావిత్రమ్మలు చీటీలు వడ్డీల వ్యాపారం నడుపుతూ, తాము చీటీలను పాడుకున్నా కానీ డబ్బు ఇవ్వకుండా తమకు మాయమాటలు చెప్పి అప్పు తీసుకున్నారని, తమ దగ్గర నుంచి తీసుకున్న డబ్బును అమెరికాలో ఉన్న వారి కుమారులకు చేరవేసి తమకు ఐపి పిటిషన్ ను నోటీసులను పంపించడం జరిగిందన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు డిఎస్పి అని కోరారు. విచారణ చేపట్టి తగు న్యాయం చేస్తామని వారికి డి. ఎస్. పి హామీ ఇచ్చారు.

## జూడో క్లస్టర్ ఛాంపియన్షిప్ లో పులివెందుల ఎస్ పి ఎఫ్ కానిస్టేబుల్ విజయ కేతనం







పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 1

ఈ నెల 23 తేదీ నుంచి 31 వరకు హైద్రాబాద్ గచ్చిబౌలి లో నిర్వహించిన 11 వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ చంపియన్షిప్ లో పులివెందుల ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు ఆంధ్ర ప్రదేశ్ నుండి పాల్గొని తైక్వాండో టీమ్(ఖువఎషీఅంశీ ఋఎ) ఈవెంట్ లో బంగారు పతకం సాధించారు అంతే కాకుండా 2027 ఆస్ట్రేలియా లో జరిగే వరల్డ్ పోలీస్ చాంపియన్ షిప్ కి కూడా ఎంపికైనారు.బి. ఎస్. ఆర్ మార్షిఅలర్ట్స్ అకాడమీ నీ కూడా పులివెందులలో నిర్వహిస్తున్నారు. కోచ్ శ్రీనివాసరావు.ఈయన పులి వెందుల లోని యు సి ఐ ఎల్ లో ఎస్ పి ఎఫ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నరు.

# అనాధలకు,వృద్ధులకు సేవ చేయడం అభినందనీయం

**- వృద్ధాశ్రమం వార్షికోత్సవంలో పాల్గొన్న తులసి రెడ్డి.**




లింగాల కదిలించే వార్త ఆగస్టు 1

లింగాల మండలం,ఇప్పట్ల గ్రామం వద్ద ఉన్న శ్రీ మూలి లీలావతి నాగిరెడ్డి ల స్మారక వృద్ధాశ్రమం వార్షికోత్సవం మూలి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, ప్రముఖ రాజకీయ నాయకులు శివ మోహన్ రెడ్డి,ముకుంద రెడ్డి,బలరామిరెడ్డి, రాజారెడ్డి, విశ్వనాథరెడ్డి రిటైర్డ్ పంచాయతీరాజ్ డిఇ సుధాకర్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు నూర్ భాషా, రమేష్, అమర్నాథ్ రెడ్డి,తోపిడీ రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ చిన్నకోట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రులైన స్వర్గీయ లీలావతి,నాగిరెడ్డిల జ్ఞాపకార్థం మూలి కిరణ్ కుమార్ రెడ్డి ఆహ్లాదకరమైన వాతావరణంలో వృద్ధాశ్రమాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు.మానవసేవయే మాధవసేవ అన్న స్ఫూర్తితో సేవా రంగాన్ని ఎన్నుకొని అందులోనూ అనాధలకు,వృద్ధులకు సేవ చేయడం అభినందనీయమన్నారు. వృద్ధఆశ్రమం లో రక్తదానం కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని అన్నారు.అన్ని దానాల లోకెళ్ళ రక్తదానం ప్రధానమైనదని,ప్రతి రక్తదాత నిజమైన హీరో అని తులసి రెడ్డి అభివర్ణించారు మానవత్వం మరుగున పడుతున్న నేటి కాలంలో మూలి కిరణ్ కుమార్ రెడ్డి లాంటి మానవత్వం ఉన్న మనుషులు కూడా ఉన్నారని తులసి రెడ్డి అన్నారు.

# వెంకటరమణస్వామి ఆలయంలో విరాట పర్వ పఠనం





పులివెందుల కదిలించే వార్త ఆగస్టు1 పులివెందుల పట్టణ పరిధిలో కొలువై ఉన్న శ్రీ పద్మావతి వెంకటరమణ స్వామి శ్రీవారి ఆలయం లో శనివారం 19 వ రోజు. కొనసాగు తున్న విరాట పర్వపఠనం శ్రీ వెంకటరమణస్వామి ఆలయ కమిటీ శ్రీ మద్భగ వ గీత ధర్మ ప్రచార కమిటీ వారి అధ్వర్యంలో గతనెల 15 నుంచిఆగస్టు 12 వరకు ఈకార్యక్రం నిర్వ హించ నున్నారు .వర్షంసకాలం లో కురిసి పాడి పంటలతో సస్య శ్యామలంగాఅందరూ బాగుండాలని కోరుతూ ఈ మహా యాగంచేపట్టారు. ఈ కార్య క్రమం లో వేముల మండలం గొల్లలగూడూరు శ్రీ గంగిరెడ్డి పఠనంచేయగాఅనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం నక్కల పల్లిశ్రీనారాయణరెడ్డి మధుర కంఠం తో వ్యాఖ్యానం చేసారు. ఈ కార్యక్రమం లో పట్టణ ప్రజలు తోపాటు గ్రామీణ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు కార్యక్రమం లోమద్భగవగీత కమిటీ ఆలయ కమిటీ వారు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 1

పులివెందుల మండలం కనంపల్లి గ్రామ సమీపంలో జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలను గుర్తించేందుకు పోలీసులు ప్రజల సహకారం కోరుతున్నట్టు తెలిపారు. వివరాలలోకి వెళితేపులివెందుల మండలం కనంపల్లి గ్రామం సమీపంలో శనివారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. గత మూడు రోజులుగా కనంపల్లి పరిసర ప్రాంతాల్లో ఆయన సంచరిస్తున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందినట్లు వెల్లడించారు.మృతుడి ఆచూకీ తెలిసిన వారు వెంటనే పులివెందుల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు (సెల్: 9121100548) లేదా ట్రాఫిక్ ఎస్ఐ గంగాధర రెడ్డి (సెల్: 9441153697)ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.మృతుడి వివరాలు తెలియజేసిన వారికి తగిన పారితోషికం అందజేస్తామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

# సీహెచ్‌సీ లో వైద్య సేవలు పనితీరుపై క్యూ ఆర్ కోడ్‌తో పాటు ఫిర్యాదు పుస్తకం ఏర్పాటు

## ....రోగుల అభిప్రాయాలకు ప్రాధాన్యం

## .....ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి



కమలాపురం కదిలించే వార్త ఆగస్టు 01కమలాపురం ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో రోగుల అభిప్రాయాలు, ఫిర్యాదులను నేరుగా స్వీకరించేందుకు కొత్త ఫీడ్‌బ్యాక్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది పనితీరుపై రోగులు తమ సూచనలు, ఫిర్యాదులు తెలియజేసేందుకు క్యూ ఆర్ కోడ్‌తో పాటు ఫిర్యాదు పుస్తకాన్ని ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూస్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను పరిశీలించి సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోగులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# టిడిపి ఇంటింటి కార్యక్రమం

## - ఎమ్మెల్యే మాధవి రెడ్డి



కడప ఆగస్టు 1 కదిలించే వార్త

కడప నగరంలోని 48వ డివిజన్ చౌటపల్లి లో నిర్వహించిన ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమం డివిజన్ ఇంచార్జి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి రెడ్డి పాల్గొన్నారు. శనివారం ఈ సందర్భంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సామాజిక భద్రతను అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆమె పేర్కొన్నారు. పింఛన్లు ప్రతి ఇంటికీ గౌరవప్రదంగా చేరేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు.అనంతరం లబ్ధిదారులతో ఆప్యాయంగా ముచ్చటించిన శ్రీమతి మాధవి రెడ్డి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు వీరారెడ్డి, సుబ్బరాయుడు, ఓబయ్య, సుధాకర్, వీరారెడ్డి, చిట్ట శివారెడ్డి, మన్సూర్ అలీఖాన్, రెడ్డి యాదవ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అశోక్‌నగర్‌లో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి



కడప ఆగస్టు 1 కదిలించే వార్త

కడప నగరంలోని 5వ డివిజన్ అశోక్‌నగర్‌లో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమం, కడప అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడప నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ బోనం శిలాస్, నగర అధ్యక్షుడు పఠాన్ మన్సూర్ ఖాన్, నగర ప్రధాన కార్యదర్శి బుక్కర సుబ్బరెడ్డి, ఉపాధ్యక్షులు పసుపులేటి గౌతం కుమార్, భూత్ ఇన్చార్జి బోనం అబ్రహం, టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికుల సంక్షేమమే కేకేసీ లక్ష్యం




కడప, ఆగస్టు 1 కదిలించే వార్త

కడప నగరంలోని వై.వి. వీధిలో కామ్‌గార్, కర్మచారి కాంగ్రెస్ (కేకేసీ) ఫౌండేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కేకేసీ కడప నగర చైర్మన్ షమీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కడప కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త బండి జకరయ్య, కేకేసీ జిల్లా చైర్మన్ దాసరి శ్రీనివాసులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం కేకేసీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు, కూలీలు, ఇతర ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆటో డ్రైవర్లు, పండ్ల వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

# లెన్స్‌కార్ట్ అంశంపై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం



కదిలించే వార్త ధర్మవరం ఆగస్టు 1

ధర్మవరం పట్టణంలో లెన్స్‌కార్ట్ షోరూమ్ ఏర్పాటుకు సంబంధించిన అంశంపై శనివారం అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు, కార్మిక, విద్యార్థి, ప్రజా సంఘాల ప్రతినిధులు, స్థానిక ఆప్టికల్ వ్యాపారులు, ఉద్యోగులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్థానిక చిన్న వ్యాపారుల భవిష్యత్, ఉద్యోగుల ఉపాధి, కార్పొరేట్ సంస్థల ప్రభావం, ప్రభుత్వ శాఖల స్పందన, చట్టబద్ధ అనుమతుల అంశాలపై విస్తృతంగా చర్చించారు.సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, ధర్మవరంలో దశాబ్దాలుగా స్థానిక ఆప్టికల్ వ్యాపారాలపై ఆధారపడి సుమారు 200 కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మంది జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ కుటుంబాలు గత తొమ్మిది నెలలుగా తమ ఉపాధి, భవిష్యత్తు మరియు చిన్న వ్యాపారాల పరిరక్షణ కోసం ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, సంబంధిత అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించి తమ సమస్యలను వివరించినప్పటికీ, ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం పట్ల సమావేశంలో తీవ్ర ఆవేదన వ్యక్తమైంది.స్థానిక వ్యాపారులు మాత్రమే కాకుండా పట్టణంలోని వివిధ వ్యాపార వర్గాలు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు కూడా ఈ సమస్యకు మద్దతుగా నిలిచి తమ అభిప్రాయాలను తెలియజేసినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత అధికారులు మరియు ప్రజాప్రతినిధుల నుంచి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పట్ల ప్రజల్లో నిరాశ, ఆందోళన వ్యక్తమవుతున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ప్రజల జీవనోపాధికి సంబంధించిన అంశాల్లో మరింత సున్నితంగా, బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.అదేవిధంగా, సంబంధిత భవనం మరియు వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన భవన నిర్మాణ అనుమతులు, కమర్షియల్ వినియోగ అనుమతులు, ట్రేడ్ లైసెన్స్, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్, ఫైర్ సేఫ్టీ అనుమతులు మరియు ఇతర చట్టబద్ధ అనుమతులపై సంబంధిత శాఖలు పూర్తి పారదర్శకతతో విచారణ నిర్వహించి ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ అంశంపై ఇప్పటికే స్థానిక వ్యాపారులు మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓ, టౌన్ ప్లానింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ సహా పలువురు అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో పలు సందేహాలకు తావిస్తోందని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. ప్రజల సమస్యల విషయంలో అధికారులు ఆలస్యం చేయకుండా చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా స్పందించాలని నాయకులు డిమాండ్ చేశారు.అలాగే, ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి స్థానిక ప్రజలు, చిన్న వ్యాపారులు, ఉద్యోగుల జీవనోపాధిని కాపాడే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఈ సమస్యపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోని పక్షంలో, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, ఆర్ఎస్పీ, సీపీఐ(ఎంఎల్), సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ, ఎంఆర్పీఎస్తో పాటు అన్ని ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, స్థానిక వ్యాపార సంఘాలు ఐక్యంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, స్థానిక చిన్న వ్యాపారులు మరియు ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.బాధితులకు తగిన న్యాయం జరిగే వరకు అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాలు మరియు స్థానిక వ్యాపారులు ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తామని, త్వరలోనే ఉద్యమ కార్యాచరణను ప్రకటించి ప్రజాస్వామ్యబద్ధమైన కార్యక్రమాలను చేపడతామని సమావేశంలో వెల్లడించారు. స్థానిక ఉపాధి, చిన్న వ్యాపారుల పరిరక్షణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమని నాయకులు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, కాంగ్రెస్ నాయకులు తుంపర్తి పరమేష్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి యర్రంశెట్టి రమణ, సీపీఐ(ఎంఎల్) నాయకులు పోలా లక్ష్మీనారాయణ, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, బీఎస్పీ నాయకులు వినయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతలయ్య, ఎంఆర్పీఎస్ అధ్యక్షులు వెంకటేష్తో పాటు స్థానిక ఆప్టికల్ వ్యాపారులు, ఉద్యోగులు మరియు పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు."స్థానిక ఉపాధి -- స్థానిక హక్కు", "చట్టం ముందు అందరూ సమానమే", "చిన్న వ్యాపారాల పరిరక్షణే సమాజ అభివృద్ధికి పునాది" అనే నినాదాలతో సమావేశం ముగిసింది.

# గండి దేవస్థాన సీనియర్ అసిస్టెంట్‌కు ఘన సన్మానం

## - పదవీ విరమణ పొందిన వసంతు జయచంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం

## - ఆలయ అధికారులు



గండి (కదిలించే వార్త) ఆగస్టు 01:

రాయలసీమలో ప్రసిద్ధి చెందిన గండి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన వసంతు జయచంద్రారెడ్డికి శనివారం ఘన సన్మానం నిర్వహించారు. గండి క్షేత్రంలోని ఈవో కార్యాలయంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సి. విశ్వనాథ్, దేవస్థాన చైర్మన్ కల్లూరు వెంకటస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జయచంద్రారెడ్డి దంపతులను ప్రత్యేకంగా సత్కరించారు.ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా రమేష్, ముఖ్య అర్చకులు రాజగోపాల్ స్వామి, వేదపారాయణ పండితులు రామ్మోహన్ స్వామిలు వసంతు జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి శోభారాణి దంపతులకు స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించి, శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జయచంద్రారెడ్డి నీతి, నిజాయితీ, కర్తవ్యనిష్ఠకు మారుపేరుగా నిలిచారని కొనియాడారు. ఆలయ అభివృద్ధికి విశేష సేవలందించడమే కాకుండా, నిత్య అన్నదాన కార్యక్రమం నిరంతరంగా కొనసాగేందుకు దాతలను సమీకరించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించి పలువురు కార్యనిర్వాహక అధికారుల ప్రశంసలు పొందారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. శివారెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, దేవస్థాన పాలక మండలి సభ్యులు కె. రామచంద్రారెడ్డి, గణేష్ రెడ్డి, ఎద్దుల చంద్ర వెంకటశివ, వేంపల్లి నారాయణ స్కూల్ కరస్పాండెంట్ నారాయణరెడ్డి, అబ్బాస్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు వేల్పుల రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర సేవా ప్రముఖ్ ఎన్నికల రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రకాశ్ రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర మీడియా కన్వీనర్ శివారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, హరీష్, గండి దేవస్థాన సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత పంచాయతీ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సహకరించాలి

## - ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం: టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి



వేంపల్లె (కదిలించే వార్త) ఆగస్టు 01:

ప్లాస్టిక్ రహిత పంచాయతీగా వేంపల్లిని తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని టీడీపీ వేంపల్లి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పిలుపునిచ్చారు.శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ కవర్ల అధిక వినియోగం వల్ల వ్యర్థాలు మురుగు కాల్వల్లో పేరుకుపోయి డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటోందన్నారు. దీనివల్ల దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు.ప్రజలందరూ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని క్రమంగా తగ్గించి, ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులు, జూట్ బ్యాగులను ఉపయోగించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామ పంచాయతీ చేపట్టే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ఆగస్టు 3న గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించుకుని, ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి మహమ్మద్, నాయకులు జబిబుల్లా, ఫయాజ్, మడక శ్రీను, తక్కెల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డా. నర్రెడ్డి తులసిరెడ్డి జన్మదిన వేడుకలు

## - వృద్ధాశ్రమంలో అన్నదానం, కేక్ కటింగ్ -- ఆయురారోగ్యాలతో ఉండాలని కాంగ్రెస్ నాయకుల ఆకాంక్ష



వేంపల్లె (కదిలించే వార్త)ఆగస్టు 01:

20 సూత్రాల పథకం మాజీ ఛైర్మన్, ఏపీఎస్‌ఆర్టీసీ మాజీ ఛైర్మన్, వైఎస్సార్ కడప జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు, ఏపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ డా. నర్రెడ్డి తులసిరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వేంపల్లితో పాటు పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. వృద్ధులకు అన్నదానం, స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి మానవతా సేవను చాటుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డా. నర్రెడ్డి తులసిరెడ్డి ప్రజాసేవలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు డా. తులసిరెడ్డికి శాలువా కప్పి, పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ ఇన్‌చార్జి ధ్రువకుమార్ రెడ్డి, కమలాపురం ఇన్‌చార్జి అశోక్ రెడ్డి, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లాబక్ష్, నాయకులు డా. సుబ్రహ్మణ్యం, ప్రసాద్ గౌడ్, వేమయ్య, రామకృష్ణ, వెంకటేష్, బద్రీనాథ్, రాఘవయ్య, పూల నజీర్, జిలాన్, రెడ్డి సాహెబ్, మహబూబ్ బాషా, అమర్, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ మేయర్ తండ్రి వెంకట సుబ్బారెడ్డికి ఎంపీ నివాళులు



కడప కదిలించే వార్త ఆగస్టు 01:

కడప నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముంతా నిత్యానంద రెడ్డి తండ్రి వెంకట సుబ్బారెడ్డి అకాల మరణం పట్ల ఎంపీ అవినాష్ రెడ్డి పలువురు వైఎస్సార్‌సిపి నాయకులు,ప్రజాప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.?వెంకట సుబ్బారెడ్డి భౌతికకాయానికి కడప ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి, బద్వేల్ శాసనసభ్యురాలు డాక్టర్ దాసరి సుధ,కడప మాజీ మేయర్ కె.సురేష్ బాబు,మాజీ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి తదితరులు సందర్శించి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.?ఈ సందర్భంగా వారు నిత్యానంద రెడ్డిని,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.వెంకట సుబ్బారెడ్డి మృతి వారి కుటుంబానికే కాక ప్రాంతానికి తీరని లోటని పేర్కొంటూ,వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కష్ట సమయంలో నిత్యానంద రెడ్డి కుటుంబానికి తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో పలువురు కడప నగర కార్పొరేటర్లు,స్థానిక నాయకులు, వైఎస్సార్‌సిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సుస్థిరమైన ఆరోగ్యకర జీవితానికి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం

**- ప్రపంచ తల్లిపాల వారోత్సవాలకు వేంపల్లిలో ఘన ప్రారంభం --**

**తొలి గంటలోనే ముర్రుపాలు అత్యంత కీలకం: సీడీపీవో వి. సునీత**





వేంపల్లె (కదిలించే వార్త) ఆగస్టు 01:సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవితానికి తల్లిపాల సంస్కృతిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఐసీడీఎస్ వేంపల్లి ప్రాజెక్టు సీడీపీవో వి. సునీత పిలుపునిచ్చారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం వేంపల్లి పట్టణంలోని గరుగువీధి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు అత్యంత విలువైనవి, వ్యాధి నిరోధక శక్తిని పెంచే సహజ రక్షణ కవచమని తెలిపారు. పుట్టిన తొలి గంటలోపే శిశువుకు ముర్రుపాలు ఇవ్వడం అత్యంత అవసరమన్నారు. అలాగే పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు, చక్కెర నీరు, పండ్ల రసాలు, ఆవు లేదా గేదె పాలు, గంజి వంటి ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలను అందించడంతో పాటు వ్యాధుల నుంచి రక్షిస్తాయని, సులభంగా జీర్ణమవుతాయని ఆమె వివరించారు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకుని శిశువుకు పూర్తిస్థాయిలో తల్లిపాలు అందించాలని కోరారు. ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డా. పృథ్వీకుమార్ రెడ్డి, సూపర్వైజర్ ఫకృద్దీన్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు డా. స్వర్ణలత, సుభద్ర, ఏఎన్ఎం అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# మడకలవారిపల్లె భూములను రీ సర్వే చేసి అక్రమ కట్టడాలు తొలగించాలి



కడప ఆగస్టు. 1 కదిలించే వార్త మడకలవారిపల్లె రెవెన్యూ గ్రామ పొలాన్ని రీ సర్వే చేసి, 70కి పైగా లేఅవుట్లలోని రస్తాలు, కల్వర్టులు, పబ్లిక్ పర్పస్ స్థలాలను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం గోపవరం మండల డిప్యూటీ తహసిల్దార్ హరికి పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాజకీయ, ఆర్థిక పలుకుబడి ఉన్న బడా బాబుల ఆక్రమణలను పట్టించుకోకుండా, పేదలు నిర్మించుకున్న ఇళ్లను మాత్రమే కూల్చడం సరికాదన్నారు. ప్రభుత్వ స్థలాలు, రోడ్లు, కల్వర్టులు, పబ్లిక్ పర్పస్ స్థలాల్లో జరిగిన ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అందరి పట్ల అధికారులు సమానంగా వ్యవహరించి, ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పి. చంద్రమోహన్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు కే. జకరయ్య, నియోజకవర్గ కమిటీ సభ్యులు సంజీవరాయుడు, విజయరావు, కే. బాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేయాల్సిన అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం

**- వెలుగు కార్యాలయానికి తాళాలు..మధ్యాహ్నం ఒంటి గంటకే ఖాళీ..!**

**- పని వేళల్లో సిబ్బంది గైర్హాజరుపై ప్రజల ఆగ్రహం**

**- వివిధ పనుల కోసం వచ్చి నిరాశతో వెనుదిరిగిన మహిళా సంఘాల సభ్యులు**

**- విధి నిర్వహణపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్**

వేముల కదిలించే వార్త ఆగస్టు 01:-

వేముల మండల కేంద్రంలోని స్థానిక వెలుగు (సెర్ప్) కార్యాలయం శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకే పూర్తిగా తాళాలు వేసి ఉండడం స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ప్రభుత్వ కార్యాలయం పని వేళల్లోనే మూసివేయబడడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన మహిళా సంఘాల సభ్యులు,గ్రామీణ ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. ప్రభుత్వ కార్యాలయాలు నిర్ణీత పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా,కార్యాలయానికి తాళం వేసి ఉండడంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కార్యాలయంలో ఏపీఎం సహా సిబ్బంది ఎవరూ లేకపోవడం గమనార్హం. దీంతో అత్యవసర పనుల కోసం వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. గ్రామీణ మహిళల అభివృద్ధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం వెలుగు శాఖ ద్వారా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. మహిళా సంఘాలకు రుణాలు, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్న శాఖ కార్యాలయం పని వేళల్లోనే మూసివేయడం వల్ల ప్రభుత్వ సేవలపై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కోసం పనిచేయాల్సిన అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారా..? లేక ఇతర అధికారిక పనుల నిమిత్తం బయటకు వెళ్లారా..? అనే అంశంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



**ప్రజల డిమాండ్..**

పని వేళల్లో ప్రభుత్వ కార్యాలయాలను తప్పనిసరిగా తెరిచి ఉంచాలని,అధికారులు,సిబ్బంది హాజరుపై ఉన్నతాధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా స్థాయి అధికారులు విచారణ జరిపి,విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ సేవలకు ఆటంకం కలగకుండా కార్యాలయ నిర్వహణపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వృద్ధాప్య పింఛన్లను రాజకీయ ప్రచారానికి వాడుకోవద్దు: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోటపాటి లక్షుమయ్య



కడప ఆగస్టు 1 కదిలించే వార్త

ప్రభుత్వ సంక్షేమ పథకమైన వృద్ధాప్య పింఛన్లను రాజకీయ ప్రచారానికి వేదికగా ఉపయోగించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోటపాటి లక్షుమయ్య అన్నారు. ప్రజల పన్నుల ద్వారా సమకూరే ప్రభుత్వ నిధులతో పింఛన్లు అందుతున్నాయని, వాటిని ఏ రాజకీయ పార్టీ తమ సొంత నిధులతో ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం ఖండించదగ్గ విషయమన్నారు. పింఛను లబ్ధిదారుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సంక్షేమ పథకాలను రాజకీయాలకు దూరంగా ఉంచాలని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులను ఆయన కోరారు.

# సంక్షేమంలో ఏపీ దేశానికే ఆదర్శం

## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు టిడిపి ఇన్చార్జ్ జేబీ శ్రీనివాసులు



తిరుపతి కదిలించే వార్త 1 ఆగస్టు

తిరుపతి సంక్షేమంలో దేశానికే మన రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. పేదలకు అత్యధిక పెన్షన్ ఇస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువ నాయకులు లోకేష్ లకే దక్కుతుందని కల్పిస్తున్నారని ఆయన తెలిపారు. పింఛను ఎవరు అందిస్తున్నారని లబ్ధిదారులను ఎమ్మెల్యే అడగగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంపై పది లక్షల కోట్లు అప్పు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టి వెళ్ళినా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్ ను ప్రభుత్వం అందిస్తున్నదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అలాగే సూపర్ సిక్స్ అమలు చేసి ఇచ్చిన మాటను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటున్నదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, టిడిపి ఇంచార్జ్ జేబి శ్రీనివాస్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్పొరేషన్ లో 18వేల రెండు వందల మందికి 8 కోట్లా 9 లక్షలా 27 వేలు ప్రతి నెలా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వెల్లడించారు.

# జిల్లాలోని పలు గ్రామాల్లో 'స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్

**-జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ IPS ఆదేశాల మేరకు అవగాహన కల్పించిన అధికారులు**

అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, ఆగస్టు 01 :

గ్రామాల్లోని ప్రజలు, ముఖ్యంగా యువత చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ గారు పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో విస్తృతంగా 'స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్' నిర్వహించారు. సైబర్ నేరాలు, రహదారి భద్రత, మహిళల రక్షణ, బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై అప్రమత్తత: రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతికతతో పాటు సైబర్ నేరాలు కూడా విస్తరిస్తున్నాయని అధికారులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ (గారూ) వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. రహదారి నిబంధనలు పాటించాలి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. అత్యవసర నంబర్లు.. యాప్‌లు: మహిళలు, పిల్లల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 'స్త్రీ రక్ష', 'శక్తి' యాప్‌ల వినియోగంపై ప్రచారం చేశారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా 112 నంబర్లకు, పిల్లల సహాయం కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు. బాలలపై జరిగే



లైంగిక వేధింపులను అరికట్టే 'పోక్సో' (POCSO) చట్టం వివరాలను ప్రజలకు వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే రౌడీషీట్లు: గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని పోలీసులు హెచ్చరించారు. జూదం, మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి విక్రయాల వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు. చెడు వ్యసనాలకు బానిసలై యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

# అడ్వాన్స్ వివాదం.. బ్లేడుతో దాడి ఇద్దరి అరెస్టు.. 15 రోజుల రిమాండ్

వేంపల్లె (కదిలించే వార్త) ఆగస్టు 01: టైల్స్ పనికి తీసుకున్న అడ్వాన్స్ డబ్బుల వివాదం హత్యాయత్నానికి దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కోర్టు ఆదేశాల మేరకు 15 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఇ. తిరుపాల్ నాయక్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు శ్రీరామ్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి వెంకటరమణ, నరసింహులు టైల్స్ పనులు పర్యవేక్షిస్తుంటారు. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ముల్లేల సాయికిరణ్ టైల్స్ పని చేస్తానని అడ్వాన్స్ తీసుకున్నాడు. అయితే పనికి రాకపోవడంతో పాటు డబ్బులు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు నిలదీశారు. ఈ క్రమంలో సాయికిరణ్ తన బావ పూజారి ఆంజనేయులు అలియాస్ అంజితో కలిసి జూలై 30న బాధితులపై బ్లేడుతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో వెంకటరమణ మెడ, భుజానికి గాయాలు కాగా, నరసింహులపై కూడా దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం రాజీవ్‌నగర్ కాలనీ బస్‌స్టాప్ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పులివెందుల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, 15 రోజుల రిమాండ్ విధించడంతో పులివెందుల సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. అరెస్టయిన వారిలో ముల్లేల సాయికిరణ్ (24), పూజారి ఆంజనేయులు అలియాస్ అంజి (27) ఉన్నారు. పోలీసులు ప్రజలు చిన్నచిన్న వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

# జిల్లాలో పోలీసుల అవగాహన సదస్సులు

అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, ఆగస్టు 01 :

అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ గారూ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల భద్రత, నేరాల నియంత్రణపై విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించారు. మహిళలు, చిన్నారుల రక్షణ : పోక్సో (గారూజూరా) చట్టం గురించి వివరిస్తూ, ఈవ్‌టీజింగ్ లేదా లైంగిక వేధింపులకు గురైతే భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అత్యవసర సహాయం : ఆపద సమయంలో 100 మరియు ఏకీకృత అత్యవసర నంబరు 112 కు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన : సోషల్ మీడియాలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, గారూలు మరియు వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. సైబర్ మోసం జరిగితే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్ ఒ రోడ్డు భద్రత : 18 ఏళ్ల లోపు వారు వాహనాలు నడపడం నేరమని, మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు



మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ సదస్సుల్లో స్థానిక సీఐలు, ఎస్ఐలు, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్, IPS

అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, ఆగస్టు 01 :

అనంతపురం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ నందు పదవీ విరమణ పొందిన ఇద్దరు సబ్ ఇన్స్పెక్టర్లు, ఒక రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ ల ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్, గారూ ముఖ్య అతిథిగా హాజరై పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన అధికారులు: శ్రీ నాగమాణిక్యం (SI – పీసీఆర్, అనంతపురం)శ్రీ ఈశ్వరయ్య (SI – నార్పల పోలీస్ స్టేషన్)శ్రీ చిక్కానాయక్ (RSI – అనంతపురం) జిల్లా ఎస్పీ ప్రసంగం :ఈ సందర్భంగా ఎస్పీ శ్రీ పి.జగదీష్ గారూ మాట్లాడుతూ... పోలీసు శాఖలో దశాబ్దాల పాటు సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు, శాఖకు అందించిన సేవలను కొనియాడారు. క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న ఈ అధికారుల సేవలు అభినందనీయమని తెలిపారు. "పోలీసు శాఖలో సుదీర్ఘ సేవలు అందించి, ఎటువంటి మచ్చ లేకుండా పదవీ విరమణ పొందడం ఎంతో గర్వకారణం. పదవీ విరమణ తదుపరి జీవితాన్ని వారు తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షిస్తున్నాను."పదవీ విరమణ పొందిన అధికారులు పోలీసు శాఖతో తమకున్న అనుబంధాన్ని, సర్వీస్ కాలంలో ఎదురైన అనుభవాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తమ సేవలను గుర్తించి ఘనంగా సన్మానించినందుకు ఎస్పీ కి, తోటి




అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.నాగభూషణం, ఎస్ మహబూబ్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ ఐ పవన్ కుమార్ , జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్ , గాండ్ల హరినాథ్ , లక్ష్మినారాయణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది మరియు పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# కమల్ అమృత్ వాణి-214



దానేన వర్ధతే లక్ష్మీర్విద్యా వర్ధతి కీర్తనాత్ ।
సద్వ్యయేన ధనం శ్రేష్ఠం పరహితే వినియుజ్యతే ॥

తాత్పర్యం.

దానం అంటే కేవలం ధనం ఇవ్వడం మాత్రమే కాదు.జ్ఞానం, సమయం, సహాయం కూడా దానమే.పంచిన కొద్దీ ప్రేమ పెరుగుతుంది.పరులకు ఉపయోగపడే సంపదే నిజమైన సంపద.దాతృత్వం మనసును విశాలం చేస్తుంది.స్వార్థం తగ్గిన చోట సేవాభావం పెరుగుతుంది.

చిన్న సహాయం కూడా గొప్ప మార్పును తీసుకురాగలదు.

దానగుణమే మానవత్వానికి శోభ.

-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

## 'మన బడి - మన భవిష్యత్తు' సివిల్ పనుల మందగమనంపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి

**- పనుల్లో వేగం పెంచేందుకు తగిన ప్రణాళికలతో రావాలి ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**- సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహణ**

**- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**



పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, ఆగస్టు 01:

పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న 'మన బడి – మన భవిష్యత్తు' సివిల్ పనుల పురోగతి చాలా తక్కువగా ఉండటంపై శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం 6:30 నుండి 7:30 గంటల వరకు వివిధ ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలోని మోడల్ ప్రైమరీ స్కూల్స్, మరియు ప్రస్తుతం పురోగతిలో ఉన్న వివిధ పాఠశాల సివిల్ పనులపై కలెక్టర్ శాఖల వారీగా సమగ్ర సమీక్ష చేపట్టారు. సమగ్ర శిక్ష, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ , మున్సిపాలిటీ తదితర ఇంజనీరింగ్ విభాగాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తమ విభాగాల ద్వారా జరుగుతున్న పనుల పురోగతిని కలెక్టర్‌కు వివరిస్తూ నివేదికలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బడుల అభివృద్ధి పనుల్లో ఆలస్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. పనుల పురోగతిని వేగవంతం చేసేందుకు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యక్ష సమీక్షా సమావేశానికి హాజరు కావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యా శాఖాధికారి జి. కృష్ణప్ప, సమగ్ర శిక్ష ఈఈ జయరాం, పంచాయతీరాజ్ ఈఈ మురళీమోహన్ వీజూా 2 మరియు ఇతర ఇంజనీరింగ్ విభాగాధికారులు పాల్గొన్నారు.

## మోడీ సహకారంతో చంద్రబాబు నాయకత్వంలో నవ్యాంధ్ర అభివృద్ధి

**- ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ఎయిర్ పోర్ట్ కీలక మైలురాయి**

**-రాష్ట్ర సమగ్ర అభివృద్ధి డబ్బులు ఇంజన్ సర్కార్ తోనే సాధ్యం**

**-2407 ఎకరాల్లో రూ.4727 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు.**

**-500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్.**

**--130 ఎకరాల్లో ఎడ్యుసిటీ**

**-అల్లూరి సీతారామరాజు ఎయిర్పోర్టుగా నామకరణం చేయడం ఎంతో చారిత్రాత్మక నిర్ణయం.**

**-ఉత్తరాంధ్రకు అంతర్జాతీయ విమానాశ్రయం రావడంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి ఉద్యోగ అవకాశాలు.**

**-ప్రధాని మోదీ సహకారంతో,సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో వికాసం వైపు ఏపీ**

**-నేడు ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ఏపీలో 18వేల కోట్ల తో స్వర్ణాంధ్ర అభివృద్ధికి శ్రీకారం చేపట్టడం అభినందనీయం**

**-రాయలసీమ అభివృద్ధికి కేంద్ర సర్కార్ సహకారంతో చంద్రబాబు ప్రత్యేక కృషి మరువలేనిది.**

**-ఎర్ర బస్సు రాదని ఎగతాళి చేసిన వైసిపి నేతలకు గుణపాఠం చెప్పేలా డబుల్ ఇంజన్ సర్కార్ లో ఎయిర్ బస్సు వచ్చింది**

**-సాధ్యం కాని పనులు సాధ్యమయ్యేలా చేసే నాయకత్వం దేశానికి మోడీ ఉంటే ,ఏపీకి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ,లోకేష్ ఉన్నారు**

**- భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం పై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ,సీఎం చంద్రబాబు ,పవన్ కల్యాణ్,నారా లోకేష్ కు ప్రత్యేక అభినందనలు తెలిపిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి**



పుట్టపర్తి, కదిలించే వార్త, ఆగస్టు 01 :ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నవ్యాంధ్ర సమగ్ర అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురంలో ఏర్పాటు చేస్తున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆమె అన్నారు. రూ.4,727 కోట్ల వ్యయంతో 2,407 ఎకరాల్లో నిర్మితమవుతున్న ఈ అంతర్జాతీయ విమానాశ్రయం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపుతుందన్నారు. విమానాశ్రయానికి అనుబంధంగా 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 130 ఎకరాల్లో ఎడ్యుసిటీ ఏర్పాటు చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో పారిశ్రామిక, విద్యా రంగాలకు విశేష ప్రోత్సాహం లభించనుందన్నారు.ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే కొనియాడారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ఉత్తరాంధ్ర యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ఆమె తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ వికాస పథంలో దూసుకెళ్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.18 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం స్వర్ణాంధ్ర నిర్మాణానికి బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతోందని పేర్కొన్నారు. రాయలసీమ అభివృద్ధికి కూడా కేంద్ర ప్రభుత్వం సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక కృషి చేస్తున్నారని చెప్పారు.గతంలో "ఎర్ర బస్సు కూడా రాదు" అంటూ ఎగతాళి చేసిన వైసీపీ నాయకులకు సమాధానంగా నేడు డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం సాకారం కావడం ప్రజల ఆకాంక్షలకు నిదర్శనమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వ్యాఖ్యానించారు.దేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ వంటి దూరదృష్టి కలిగిన నాయకత్వం ఉండటంతో అసాధ్యమనుకున్న ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నేడు సాకారమవుతున్నాయని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా "ఆపరేషన్ నైట్ సేఫ్టీ" నిర్వహణ

**- శాంతిభద్రతల పరిరక్షణ, రాత్రి వేళల్లో ప్రజల భద్రతే ధ్యేయంగా తనిఖీలు**





అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, ఆగస్టు 01 :

జిల్లాలో నేరాల నియంత్రణ, రాత్రి వేళల్లో ప్రజల భద్రతను పటిష్టం చేయడం, శాంతిభద్రతలను పరిరక్షించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం నిన్న రాత్రి ప్రత్యేకంగా " ఆపరేషన్ నైట్ సేఫ్టీ " (Operation Night Safety) కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్, ఖ్రూా ఆదేశాలు మరియు పర్యవేక్షణలో ఈ తనిఖీలు జిల్లా వ్యాప్తంగా ఒకే సమయంలో అత్యంత శ్రద్ధతో జరిగాయి.

**ఆపరేషన్ నైట్ సేఫ్టీలోని ముఖ్యాంశాలు :**

సస్పెన్స్ తనిఖీలు ఒ నాకాబంధీ : జిల్లాలోని అన్ని ప్రధాన జంక్షన్లు, అంతర్రాష్ట్ర/అంతర్జిల్లా సరిహద్దులు మరియు సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తీవ్రంగా తనిఖీ చేశారు. అనుమానితుల తనిఖీ : రాత్రి వేళల్లో అకారణంగా తిరుగుతున్న అనుమానితులను, పాత నేరస్తులను (Old Offenders) అదుపులోకి తీసుకుని విచారించారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై చర్యలు (ఐతీబఅ౨ ఒ ఐతీఅజవ): రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. లాడ్జీలు, హోటళ్ల తనిఖీ : జిల్లా పరిధిలోని లాడ్జీలు, హోటళ్లు మరియు ధాబాలను తనిఖీ చేసి, నిర్వాహకులకు సరైన ఐడెంటిటీ కార్డులు లేకుండా ఎవరికీ గదులు కేటాయించవద్దని హెచ్చరించారు. రాత్రిపూట ప్రయాణికులకు భద్రత : బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, నిర్మానుష్య ప్రాంతాల గుండా ప్రయాణించే వారికి రక్షణ కల్పిస్తూ పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు."జిల్లాలో ప్రజల ప్రాణ, ఆస్తుల భద్రతే మొదటి ప్రాధాన్యత. నేరాల అదుపునకు ఇటువంటి ' ఆపరేషన్ నైట్ సేఫ్టీ ' తనిఖీలు ఇకపై కూడా నిరంతరం కొనసాగుతాయి. రాత్రి వేళల్లో అకారణంగా బయట తిరుగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## జానకంపల్లిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్





బుక్కపట్నం, కదిలించే వార్త,ఆగస్టు,1:



శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం, జానకంపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ పాల్గొని లబ్ధిదారులకు నేరుగా పింఛను నగదును అందజేశారు.ఈ పర్యటనలో భాగంగా కలెక్టర్ స్వయంగా లబ్ధిదారుల గృహాలకు వెళ్ళి పింఛను సొమ్మును పంపిణీ చేశారు. జనకంపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కలెక్టర్ చేతుల మీదుగా పింఛన్లు అందాయి.

అన్నగిరి అచ్చమ్మ (వృద్ధాప్య పింఛను– 4000)

బ్యాళ్ళ లక్ష్మీనారాయణ(వృద్ధాప్య పింఛను–4000)

ఎ. చిన్నగమ్మ (వితంతు పింఛను–4000)

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..

అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో, పారదర్శకంగా ఇంటి వద్దకే పింఛను సొమ్మును అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి, వారి యోగక్షేమాలను మరియు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి నరసయ్య,స్థానిక మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా డిసిప్లినరీ కమిటీ (DDC) సమావేశం నిర్వాహించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్





పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, ఆగస్టు 1:

శనివారం కలెక్టరేట్ లోని వీడియో కన్ఫారెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన డిస్టిక్ డిస్పేనరి కమిటీ (ఔఔజ) సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా హాస్పిటల్స్ వీణలు మరియు మెడికో డాక్టర్లతో గ్రీవెన్స్ (ఫిర్యాదుల)పై పూర్తిస్థాయి విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'హవీ–=ూనాూ" పథకం గురించి గౌరవ కలెక్టర్ వివరంగా మాట్లాడారు.రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ, నగదురహిత (ఝుంప్రశ్రీవంం) అత్యవసర వైద్య చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం సేవ , కరుణ, రక్షణ అనే త్రిసూత్రాలపై రూపొందించబడింది. డబ్బు లేకపోవడం వల్ల ఏ ప్రమాద బాధితుడూ ప్రాణరక్షక చికిత్సకు దూరం కాకూడదనేది దీని ప్రధాన లక్ష్యం.రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ అత్యవసర వైద్య చికిత్స అందించడం.ప్రమాదం జరిగిన వెంటనే "గోల్డెన్ అవర్"లో చికిత్స అందించి అమూల్యమైన ప్రాణాలను కాపాడడం.ఆర్థిక ఇబ్బందులు లేకుండా బాధితులకు పూర్తి ఉచిత, నగదురహిత వైద్య సేవలు అందించడం.మోటారు వాహన ప్రమాదంలో గాయపడిన ప్రతి భారతీయ పౌరుడు ఈ పథకానికి అర్హుడు.ప్రమాదం జరిగిన 24 గంటలలోపు ఆసుపత్రిలో చేరాలి. (24 గంటల తర్వాత చేరిన కేసులు వర్తించవు).ఒక్కో బాధితునికి గరిష్టంగా ?1.5 లక్షల వరకు నగదురహిత చికిత్స అందుతుంది.ఆసుపత్రిలో చేరిన తేదీ నుండి గరిష్టంగా 7 రోజుల వరకు అత్యవసర చికిత్స ఖర్చులు వర్తిస్తాయి.ఇతర ప్రభుత్వ ఆరోగ్య పథకాల కంటే హవీ–=ూనాూ పథకానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.అర్హత కలిగిన ప్రతీ రోడ్డు ప్రమాద కేసును హవీ–=ూనాూ పథకం కింద తప్పనిసరిగా నమోదు చేయాలి. రోడ్డు ప్రమాద బాధితులను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించకుండా తక్షణ అత్యవసర చికిత్స అందించాలి. అర్హత కలిగిన బాధితునికి చికిత్స నిరాకరిస్తే, అమల్లో ఉన్న చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన మరియు శిక్షార్హ చర్యలు ఉంటాయి.ఈ సమావేశంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ వీ. శ్రీదేవి,ఐజఝా డాక్టర్ మధుసూదన్, ఐవీడఝా డాక్టర్ ఫైరోజ బేగం,ఖాఝీ డాక్టర్ పద్మజ,ముగ్గురు టీమ్ లీడర్లు మరియు వైద్య మిత్రలు పాల్గొన్నారు.

## రూరల్ మండలంలో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రారంభం.

**- తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం : సీడీపీఓ ఉమాశంకరమ్మ**




అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 01 :ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని అనంతపురం రూరల్ ప్రాజెక్టు పరిధిలోని రూరల్ మండలం కక్కలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం "బెస్ట్ ఫీడింగ్ సెలబ్రేషన్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ ఉమాశంకరమ్మ మాట్లాడుతూ, తల్లి పాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని అన్నారు. శిశువు జన్మించిన మొదటి గంటలోపే తల్లిపాలు పట్టించడం ఎంతో అవసరమని, మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అనంతరం సరైన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం వల్ల శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ, తల్లిపాల వల్ల శిశువుతో పాటు తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. బాలింతలు అపోహలను వీడి తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవేణి, సూర్యప్రభ, విజయలక్ష్మి, తిప్పక్క, వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు లక్ష్మి, కాంతమ్మ, విజయలక్ష్మి పాల్గొని తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, సరైన పోషకాహారం, శిశు సంరక్షణ తదితర అంశాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, స్థానిక మహిళలు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు స్థానికులు అంగన్‌వాడీ, ఆశా సిబ్బందిని అభినందించారు.



# వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి -- అనంత కలెక్టరేట్ వరకు భారీ రథయాత్ర

**- 70 ఏళ్లుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్న వాల్మీకి సమాజం -**

**- సీఎం చంద్రబాబు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేసిన బుల్లెట్ లింగమయ్య**


















అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 01 :

శ్రీ మహర్షి వాల్మీకి సేవాదళ్ అధ్యక్షుడు బుల్లెట్ లింగమయ్య ఆధ్వర్యంలో వాల్మీకి సమాజానికి ఎస్టీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా భారీ రథయాత్ర నిర్వహించారు. తాడిపత్రి నుంచి అనంతపురం కలెక్టరేట్ వరకు సాగిన ఈ రథయాత్రలో వాల్మీకి సోదరులు, సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటారు.అనంతపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన సభలో నాయకులు మాట్లాడుతూ, గత 70 సంవత్సరాలుగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఉద్యమం చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే వాల్మీకి సమాజాన్ని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని, అనంతరం ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని విమర్శించారు.గత వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయలేదని, ప్రస్తుతం రెండేళ్లుగా అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కూడా ఈ అంశంపై స్పందించలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే జోక్యం చేసుకుని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర నాయకులు కొండపల్లి అక్కులప్ప తదితరులు హాజరై ఉద్యమానికి తమ మద్దతు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాల్మీకి సంఘాలన్నింటినీ ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.అనంతరం నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వాల్మీకి సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రతి నెల 1 న పెన్షన్ల పండుగతో ప్రతి అవ్వా,తాత మొహాల్లో ఆనందం చూస్తున్నాం.

**- రాష్ట్ర బడ్జెట్ లో రూ.10వేల కోట్లకుపైగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు కోసమే ఖర్చు చేస్తున్నాం.**

**- సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో సంక్షేమం ,అభివృద్ధి అమలు**

**- 5వ తరం ఫైటర్ జెట్ యూనిట్ పరిశ్రమ ఏర్పాటుతో పుట్టపర్తి నియోజకవర్గ రూపురేఖలు మారడం ఖాయం .**

**- త్వరలో ఆమడగూరు ప్రాంతంలో అతి పెద్ద రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు**

**- నియోజవర్గానికి లక్షల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలు రానున్నాయి**

**- ఇంటింటికి తెలుగుదేశం ప్రచార కార్యక్రమం లో ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది.**

**- కప్పలబండ లో పించన్లు పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి బర్త్ డే సందర్భంగా కప్పలబండ లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న టీడీపీ కుటుంబ సభ్యులు**

















పుట్టపర్తి, కదిలించే వార్త, ఆగస్టు 01 :

ప్రతి నెల ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరుగుతుండగా, ప్రతి అవ్వా--తాత ముఖంలో ఆనందాన్ని చూడటం ఎంతో సంతోషంగా ఉందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అన్నారు.శనివారం పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి లబ్ధిదారులకు ఎంఎల్ఏ పల్లె సింధూర రెడ్డి స్వయంగా పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లకు పైగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసమే కేటాయించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 5వ తరం ఫైటర్ జెట్ యూనిట్ పరిశ్రమ ఏర్పాటుతో నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని, త్వరలో ఆమడగూరు ప్రాంతంలో భారీ రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కానుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుల ద్వారా నియోజకవర్గానికి లక్షల కోట్ల పెట్టుబడులు, వేలాది ఉద్యోగ అవకాశాలు లభించి యువతకు ఉపాధి కలుగుతుందని ఎమ్మెల్యే వివరించారు.ఇంటింటికి తెలుగుదేశం ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు స్వాగతిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జన్మదినం సందర్భంగా కప్పలబండ గ్రామంలో అడుగడుగునా టీడీపీ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి గ్రామస్తులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో ఎమ్మెల్యే గా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రజా ప్రతినిధులు రాష్ట్ర డైరెక్టర్లు వలిపి శ్రీనివాసులు,యశోద రాయుడు ,సహకార సొసైటీ అధ్యక్షులు విజయకుమార్ ,రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ పెద్దన్న ,చంద్రశేఖర్ ,శ్రీనివాసులు ,గోపాల్ ,నారాయణ స్వామి, నాగరాజు , మాధవి,రాధా, భాగ్య లావణ్య, మణి మాల,జ్యోతి, శ్యామల ఇతర మహిళా కార్యకర్తలు,టీడీపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# భ్రూణహత్యల నిరోధానికి పోలీస్ స్పెషల్ బ్రాంచ్ నిఘా సేవలు వినియోగించుకోవాలి..

**- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



అనంతపురం, కలెక్టరేట్, కదిలించే వార్త, ఆగస్టు 01 :- భ్రూణ హత్యల నిరోధానికి, నిఘా ఉంచేందుకు స్కానింగ్ సెంటర్ ల మీద ఆరోపణలు విచారించేందుకు పోలీస్ స్పెషల్ బ్రాంచ్ సేవలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో భ్రూణహత్యల నిషేధ చట్టం అమలు కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని (పిసిడపీఎన్డిటి యాక్ట్, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంకి సంబంధించిన డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ) జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ జడ్జ్ సత్యవాణి, ఫోక్సో కోర్ట్ జడ్జి చినబాబు, తదితరులు పాల్గొన్నారు.- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిసిడపీఎన్డిటి చట్టం అమలును సమీక్షిస్తూ జిల్లాలో రోజురోజుకు క్షీణిస్తున్న లింగ నిష్పత్తి ఉన్న ఎల్లనూరు, వజ్రకరూరు మండలాల్లో జరిగిన అబార్షన్లు వివరాలను పరిశీలించి, ఆయా మండలాల్లో ప్రత్యేక శ్రద్ధతో అబార్షన్లకు కారణాలను విశ్లేషించాలని, సంబంధిత నివేదిక సమర్పించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వారీగా గుర్తించి అవగాహన శిబిరాలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా కొన్ని మండలాల్లో ఆడ సంతానం తక్కువగా నమోదు అవుతున్న దానికి కారణాలను గుర్తించాలని ఆదేశించారు. నిజంగా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ జరిగి అబార్షన్లు జరిగి ఉంటే వివరాలు సేకరించి లింగ నిర్ధారణ జరిగిన స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.- అనంతరం ఏ.ఆర్.టి ఒ సరోగసి యాక్ట్ -2021 ఎలాంటి ఉల్లంఘనలు లేకుండా అమలు చేయాలని ఫోక్సో కోర్ట్ జడ్జి చినబాబు ఆదేశించారు. ఇందుకు సంబంధించి జిల్లాలో 12 ఏ.ఆర్.టి హాస్పిటల్స్ ఉండగా, ఆయా ఆస్పత్రులను తనిఖీ చేయాలని, ఆయాచోట్ల ఆన్లైన్లో ఫిర్యాదుల నమోదుకు సాఫ్ట్వేర్ అభివృద్ధి చేయాలన్నారు.- అనంతరం రెడ్స్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో వెట్టిచాకిరి అనేది లోతుగా పాతుకుపోయిన ఒక మోసం, తదితర పోస్టర్లను జిల్లా కలెక్టర్, ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ జడ్జ్, ఫోక్సో కోర్ట్ జడ్జి, తదితరులు ఆవిష్కరించారు.- ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్ కన్వీనర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, ఆర్డిటి హెల్త్ డైరెక్టర్ డాక్టర్ దుర్గేష్, గైనకాలజిస్ట్ డా.సుచిత్ర, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు భానుజా, సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.రమేష్, జిల్లా మాస్ మీడియా అధికారి ఈ.నాగరాజు, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఆరోగ్య విద్యాధికారులు వేణు గోపాల్, విజయ భాస్కర్, వెంకటేశ్వర్లు, న్యాయ సలహాదారు ఆశారాణి, కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విజన్ ఉన్న వ్యక్తి....=జూఖీ ఉద్యోగుల సంఘం

అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 01 :

అనంతపురం నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ గా నూతనంగా నియమించబడ్డ డాక్టర్ రవీంద్రనాథ్ చౌదరి విజన్ ఉన్న వ్యక్తిగా =జుఖీ జిల్లా అధ్యక్షులు ముత్యాల రాజు తెలియజేశారు. శనివారం శాలిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యదర్శుల అనేక సమస్యలను హెల్త్ ఆఫీసర్ సావధానంగా విని పరిష్కార మార్గం చూపారని తెలియజేశారు.ఈ సమావేశంలో జిల్లా =జుఖీ కార్యదర్శి తిప్పేస్వామి.నగర సెక్రటరీల ట్రెజరర్ ముత్యాలప్ప, డాక్టర్ శ్రీనివాసులు, జానీ శంకర్, ఇస్మాయిల్, మారుతి ప్రసాద్ నరసింహమూర్తి,విద్యాసాగర్, రవి. స్వర్ణలత.శ్రావణి.లత మొదలగు సెక్రటరీలు పాల్గొన్నారు.



# కాటన్ బట్టలు రంగు పోతున్నాయా?



[illegible]

**ఎక్కువసేపు నానబెట్టకూడదు**

[illegible]

# చపాతీలు మెత్తగా రావాలంటే చిట్కాలు..



[illegible]

# చంకలో నలుపు, చెమట వాసన పోవాలంటే పాటించాల్సిన నేచురల్ చిట్కాలు!



[illegible]

# పచ్చిమిర్చి తొందరగా పాడవుతున్నాయా? నెల రోజులైనా ఫ్రెష్‌గా ఉండాలంటే

[illegible]



**తేమ లేకుండా ఆరబెట్టడం**

[illegible]

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710